


# పరదేశీ కథలు

## – చిట్టె సిద్ధ లలిత



- 108 -

## ఎడారి దయ్యం

**కువైట్ సిటీ. సవాబెర్ ఏరియా.** అక్కడున్న కంపెనీ అకామిడేషన్స్ లో దాదాపూ ఇరవై దేశాలనుండి వచ్చిన వర్కర్స్ నివసిస్తున్నారు. పనికోసం పక్షులవలె రెక్కలు కట్టుకుని ఎడారిసీమలకు ఎగిరొచ్చిన పరదేశీయులు వారు. సమయం రాత్రి 9 గంటలు అవుతోంది. డిన్నర్ టైం.

మా అపార్ట్మెంట్లోని అమ్మాయిలు తినడంలో బిజీగా వున్నారు. ఇంతలో కెవ్వుమనే కేక ధనధనమనే చప్పుళ్ళు. ఉలిక్కిపడ్డాను.

తరువాత "అమ్మో దయ్యం.. అయ్యో దయ్యం" అనే కేకలు ఆ బిల్డింగ్ అంతా మారుమ్రోగాయి. ఏం జరిగిందోనని భయపడుతూ అందరం తలుపులు తెరుచుకుని మూకుమ్మడిగా బయటకు వచ్చాం. 305 లో వుండే సుందరి తలుపు తీసుకుని కారిడార్లోకి పరిగెత్తుకొచ్చి దయ్యం దయ్యమంటూ కేకలు వేస్తోంది. మనిషి కనుగుడ్లు తిప్పుతూ ఊగిపోతోంది. ఆమె జుట్టంతా చెదిరిపోయి భయం కొలుపుతోంది. అప్పటికే ఆ ఫ్లోర్ లో వున్న అమ్మాయిలందరూ బిలబిలా బయటికి వచ్చేసారు. సుందరి వాలకం చూసిన నేను భయంతో ఒక్కడుగు వెనక్కి వేసాను. కానీ 306 లో వుండే సిరిచందన మాత్రం ధైర్యంగా సుందరి దగ్గరికి వెళ్ళింది. ఒక గ్లాసుతో నీళ్ళు తెప్పించి మొహాన కొట్టింది. ఆ దెబ్బతో కేకలు ఆపిన సుందరి గోడకు చేరగిలబడి కూర్చుని పిచ్చిచూపులు చూస్తూ తనలో తాను గొణుక్కోసాగింది. మరలా సిరిచందన ఒక గ్లాసులో నీళ్ళు తెచ్చి తాగించింది. తరువాత సుందరి తెప్పరిల్లినట్లు కనిపించింది.

కేకలు ఆపి అలా అందరినీ చూస్తూ కూర్చుంది. అమ్మాయిలందరూ చుట్టూ చేరి "దెయ్యం ఎలా వుంది, ఎక్కడ కనిపించింది, ఏం చేసింది" అనే ప్రశ్నలతో సతాయిస్తున్నారు.

నేను మాత్రం ఎందుకయినా మంచిదని వున్నచోటు నుండి కదలకుండా కాస్త వెనుకే నిలబడ్డాను. మనకు

ఇలాంటివి సరిపడవు. ఏదయినా జరిగితే తక్కున లోపలికి పరిగెత్తచ్చు కదా అనుకుంటూ గుమ్మాన్ని పట్టుకుని చూస్తుండిపోయాను.

కిందివరకూ కేకలు వినిపించాయనుకుంటా. హౌసింగ్ మేనేజర్ శివకుమార్ వచ్చి "ఏం జరిగింది, ఏమిటా కేకలు" అని కంగారుగా ప్రశ్నించాడు.

"దె..దె..దెయ్యం" అంటోంది సుందరి 305 ఫ్లాట్ కేసి వేలు చూపిస్తూ. ఆ సమయంలో తను మామూలుగా లేదు. దెయ్యం గుర్తొచ్చిందనుకుంటా మనిషి గజగజా వణికిపోతోంది.

శివకుమార్ 305 లోనికి వెళ్ళి పరిశీలించి చూసి "అక్కడ ఏమీలేదే" అంటూ బయటికి వచ్చాడు.

ఆ ఫ్లాట్ లో సుందరితో పాటూ వుంటున్న అమ్మాయిలు జేనీ, షెర్లీలు ముందుకొచ్చి చిరాగ్గా మొహంపెట్టి "ఒక వారం రోజులుగా సుందరి ఇలాగే ప్రవర్తిస్తోందని, రాత్రిపూట లేచి కేకలు వేస్తోందని ఈ విషయం ఆల్రెడీ ఎచ్.ఆర్ కు రిపోర్ట్ ఇచ్చామని ఇక సుందరితో కలిసి ఆ ఫ్లాట్ లో వుండలేమనీ" హౌసింగ్ మేనేజర్ కు ఫిర్యాదు చేస్తున్నారు.

"అయితే మీరు ఈ ఫ్లాట్ మారిపోతారా" అని ప్రశ్నిస్తున్నాడు శివకుమార్.

"నో మిస్టర్ శివకుమార్, మేము ఎప్పటినుండో వున్నామిక్కడ. మా లగేజీ కూడా ఎక్కువగా వుంది. ఈ సుందరి ఈ మధ్యనే కొత్తగా వచ్చింది, దయచేసి తననే మార్చెయ్యండి. ఎవరూ లేని చోటికి పంపించండి. అర్ధరాత్రి వేళ తన కేకలకు మేము హడలిపోతున్నాం. నిద్ర వుండటం లేదు" అంది షెర్లీ విసుగ్గా.

"అహ అదికాదు.. మీ ఫ్లాట్లో దయ్యం వుంది అంటోంది కదా. అందుకే మీరు కూడా షిఫ్ట్ అవుతారని" నసిగాడు శివకుమార్.

"దయ్యం లేదు భూతం లేదు. అంతా దాని భ్రమ. దానికి పిచ్చి వుంది. అందుకే అలా బిహేవ్ చేస్తోంది. మేము మూడేళ్ళుగా ఇక్కడే వుంటున్నాం. ఎప్పుడూ మాకు ఏమీ కనపడలేదు. ఈ శ్రీలంక సుందరికి ఏదో మానసికమైన జబ్బు వున్నట్లుంది. తనతో వుండటం కష్టం" డిక్లేర్ చేసింది జేనీ. "సరే సుందరిని సెల్లార్ లోని రూమ్ కు పంపిస్తాను" అన్నాడు శివ కుమార్.

సిరిచందన సుందరి వైపు జాలిగా చూస్తూ "అదేంటి సార్ సుందరికి ఆరోగ్యం బాలేదు కదా ఒంటరిగా సెల్లార్ గదిలో ఎలా వుంటుంది. తనకు ఏమైనా అయితే ఎవరు బాధ్యులు" ప్రశ్నించింది .

చందన కూడా శ్రీలంక నుండే వచ్చింది. అందుకే సుందరికి సపోర్ట్ గా నిలబడి మాట్లాడుతోంది.

"మరేం చెయ్యమంటావు సిరి.. సొల్యూషన్ నువ్వే చెప్పు. అయితే అంత బాధ నీకుంటే సుందరిని తీసుకెళ్ళి నీ రూమ్ లో పెట్టుకో. ఇక్కడే వుంటే రూమ్మేట్స్ కి తలనొప్పి. వాళ్ళు కూడా కంటినిండా నిద్రపోవాలి, పొద్దున్నే లేచి

ద్యూటీలకి వెళ్ళాలి" అన్నాడు శివకుమార్.

అంతే.. ఇక మారు మాట్లాడకుండా కాస్త వెనక్కెళ్ళి నిలబడింది సిరిచందన.

ఆ రాత్రే హౌసింగ్ మేనేజర్ ఇద్దరు వర్కర్స్ ని తెచ్చి సుందరి సామానంతా సెల్లార్ లోని రూమ్ కు షిఫ్ట్ చేసాడు. బాగా బెదిరిపోయిందనుకుంటా.. తెల్లారేవరకూ సుందరి మూడో ఫ్లోర్ కారిడార్ లోనే కూర్చుని ఏడ్వటం సిరిచందన ఓదార్చటం జరిగింది. తెల్లారాక సుందరి వెళుతుంటే జేనీ, షెర్లీల ముఖాల్లో ఆనందం కనిపించింది. అంతకుమించిన అస్పష్టమైన అర్థంకాని భావమేదో కనిపించింది నాకు.

302 లో వుండే హీబా "హేయ్ షెర్లీ దయ్యమున్న ఆ ఇంట్లో వుండటానికి మీకు భయం లేదా" అని అడిగింది.

"సుందరే ఒక దెయ్యం. మరో దెయ్యం ఇక్కడ లేదు. అందుకే తననే పంపేసాం" అని తేల్చేసింది షెర్లీ.

కువైట్ సిటీలో వున్న మా అకామిడేషన్ వెనుక పాత గ్రేవ్ యార్డ్ వుంది. అప్పట్లో ఊరు చిన్నది కాబట్టి అది బయట వుండేదట. తరువాత పెట్రోలు బావులు కనుగొని అరబ్బులు ధనవంతులు కావడంతో ఊరు పెరిగి పట్టణం అయింది. అందువల్ల డెబ్బైయేళ్ళ క్రితం ఆ స్మశానం చుట్టూ గోడకట్టి మూసేసారట. కానీ మా బిల్డింగ్ వెనకవైపున్న కిటికీ తెరిచి చూస్తే సమాధులన్నీ వరసగా కనిపిస్తుంటాయి. ఎవరో నేలపై వరసగా పడుకుని నిద్రపోతున్నట్లుంటుంది. ఆ దృశ్యం చూస్తుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది.

రాత్రి పూట దెయ్యాలు వచ్చి కిటికీ కొడతాయని కొందరు, కారిడార్లోనూ, మెట్లమీదా తిరుగుతుంటాయని కొందరూ చెప్తుంటారు. అలాగే ఒకసారి ఒక ఫిలిప్పీన్ అమ్మాయి ఒంటరిగా గదిలో చేపలు వేపుకుని తింటుంటే ఒక తెల్లదయ్యం వచ్చి "ఆకలేస్తోంది పిల్లా నాకూ చేపల ఫ్రై పెట్టవా" అని అడిగిందట.

ఆ పిల్ల బిత్తరపోయి తినే గిన్నె అలాగే వదిలేసి వెర్రికేకలు వేస్తూ తలుపు తెరుచుకుని బయటికి పరిగెత్తుకుని వచ్చిందట. పక్కనున్న వారందరూ ఆ పిల్లకు ధైర్యం చెప్పి లోనికెళ్ళి చూస్తే ఎవరో తిన్నట్లు చేపలన్నీ మాయమయి ముల్లులు మాత్రం గిన్నెలో వున్నాయట. తరువాత ఆ ఫిలిప్పీన్ పిల్లకు చలిజ్వరం పట్టుకుని నెలరోజుల పాటూ దయ్యం అని కేకలు వేసేదట. ఇక ఆ పిల్లను, ఆ కేకలను వేగలేక కంపెనీవాళ్ళు టికెట్లు తీసి అన్నీ సెటిల్ చేసి తన దేశమైన ఫిలిప్పీన్ కు పంపించేసారట.

ఈ కథ జరిగి ఐదేళ్ళయినా అక్కడ వున్న పాతవాళ్ళు వచ్చే కొత్తవాళ్ళకు ఆ విషయాలు చెప్తూ వుంటారు. అర్థరాత్రి పూట వెనక స్మశానం నుండి వచ్చే దెయ్యాలు బిల్డింగ్ లో తిరుగుతుంటాయని కొందరికి కనిపించాయని కథలు చెప్తుంటారు.

మరికొందరు "ఛట్ దెయ్యాలు ఎక్కడున్నాయి. వున్నా అవి మంచివే. మన మనుషులే సాటిమనిషి రక్తంతాగే

పిశాచాలు. వీళ్ళంతా కట్టుకథలు చెప్తున్నారు. వీళ్ళ మాటలు నమ్మద్దు" అనేవారు.

ఏది ఏమైతేనేం అప్పుడప్పుడూ అపార్ట్మెంట్లో ఒంటరిగా వున్నప్పుడు కొంచెం భయమేసేది. మొదట నన్ను కూడా వెనక వరసలో వున్న రూమ్ లో వేసారు. నా రూమ్మేటు ప్యారీ గోవా అమ్మాయి. తను కోల్డ్ కిచెన్ లో చెఫ్ గా పని చేసేది. తను ఎక్కువగా ఫంక్షన్స్ లో వర్క్ చెయ్యాల్సి వుండేది. అందులోనూ ఓవర్ టైం చేసేది.

అందువల్ల తను అర్థరాత్రి రెస్టారెంట్లో, ఫంక్షన్స్ లో డిన్నర్లు అవీ అయ్యాక చెఫ్ డ్యూటీ ముగించుకుని రూమ్ కు వచ్చేది. అంతవరకూ నేను ఒక్కదాన్నే రూములో వుండేదాన్ని. రాత్రిపూట శ్మశానం నుండి వెనక కిటికీ గుండా భోరున గాలి వీచేది. ఆ శబ్దం భయం గొలిపేది. అవతల ఎవరో నిలబడి అద్దాల కిటికీని కొట్టినట్లు ధనధనా చప్పుడు వచ్చేది.వెంటనే మెలకువ వచ్చి భయంతో వణికిపోయేదాన్ని.

ఒంటిగంటయినా, రెండయినా ప్యారీ వచ్చేవరకూ కదలకుండా ముదుచుకుని పడుకునేదాన్ని. తను వచ్చి తలుపు తీసాక ధైర్యం వచ్చేది.

"నీకోసమే ఎదురు చూస్తున్నా" అంటే "వై" అనేది.

"భయంగా వుంది" అనేదాన్ని.

"ఇలా అయితే కష్టం పాపా. ధైర్యంగా వుంటేనే దెయ్యాలనూ, మనుషుల్ని ఎదుర్కోగలం" అనేది.

తరువాత నా బాధ గమనించి తనే హెచ్.ఆర్ కు సమస్య చెప్పింది. తరువాత ఫ్రంట్ వరసలో రోడ్డు వ్యూ వున్న ఒక రూం లోకి మేమిద్దరమూ షిఫ్ట్ అయ్యాం. తరువాత బానే నిద్ర పట్టేది.

వెనకవైపు వున్న అమ్మాయిలు ఆ శబ్దాలు భరిస్తూ ఎలా నిద్రపోతున్నారో అనుకుని ఆశ్చర్యపోయేదాన్ని.

అలాగే నేను బిజినెస్ సెంటర్ డ్యూటీలో వున్నప్పుడు ఒక్కదాన్నే రెసెప్షన్ డెస్క్ లో కూర్చుని వున్నప్పుడు లోపల కంప్యూటర్ రూమునుండి ఎవరో టైప్ చేస్తున్నట్లు సౌండ్ వచ్చేది. ఎవరబ్బా ఎవరైనా గెస్ట్ లోపల వున్నారా, నాకు తెలియకుండా లోపలికి ఎప్పుడు వెళ్ళారు అనుకుంటూ తొంగిచూస్తే అక్కడ ఎవరూ వుండేవాళ్ళు కాదు. ఆ విషయం కాసేపు ఆలోచించి మర్చిపోయేదాన్ని.

అపుడపుడూ అలా వినబడుతోందని ఓసారి నా కొలీగ్ వేలరీకి చెప్తే "ఓ.. నీక్కూడా వినబడిందా" అంది కళ్ళు పెద్దవి చేసి.

"అంటే నీకూ అలా టైప్ చేస్తున్న శబ్దం వినబడిందా" అన్నాను ఆసక్తిగా.

"అవును. పాపం.. దెయ్యాలు కూడా తమ ప్రియులకు మెయిల్స్ పంపించాలి కదా. అందుకే వస్తుంటాయి" అంది.

నాకు నవ్వొచ్చింది.

ఇద్దరం కలిసి కాసేపు దెయ్యాల కబుర్లు చెప్పుకుని నవ్వుకున్నాం.

ఇలాంటి దెయ్యాల కబుర్లు, కథలు అక్కడ చాలా నడిచేవి. కొన్ని రోజుల తరువాత సుందరి సెల్లార్ రూమ్ లో సెట్ అయిపోయింది. దెయ్యం గోల సర్దుమణిగింది. అపుడప్పుడూ సిరిచందన సెల్లార్ కు వెళ్ళి సుందరితో కబుర్లు చెప్పి వచ్చేది. వాళ్ళిద్దరూ జిమ్ములో, వాషింగ్ రూములో కూడా జంటగా కనబడేవారు.

అలాగే షెర్లీ, జేనీ కూడా ఎక్కడికి వెళ్ళినా చెట్టాపట్టాలేసుకుని వెళ్ళేవారు. ఒక్కటిగా కనబడేవారు.

నాకెందుకో గ్రూపులు, ఫేవరిజాలు నచ్చేవి కావు. దేశాలు, మతాలు, భాషలు, రంగులు వేరయినా మనసు మంచిదయితే చాలు మాట కలిపేదాన్ని.

అలా ఓ రెండు నెలలు గడిచాయి. ఒకరోజు అకామిడేషన్ అల్లకల్లోలంగా వుంది. అందరూ ఒకచోట చేరి మాట్లాడుకుంటున్నారు.

"ఏమయింది" అని అడిగితే ఆఫ్రికా అమ్మాయి కేతీ జవాబు చెప్పింది.

"షెర్లీకి బాయ్ ఫ్రెండ్ వున్నాడట. అతని పేరు జాన్. అతడు వెనక వున్న ఎమర్జెన్సీ దారిగుండా వచ్చి వెళ్ళేవాడట. ఎవరైనా చూస్తే గుర్తు పట్టకుండా దెయ్యం వేషంలో వచ్చి షెర్లీతో గడిపేవాడు. ఈ రహస్యం రూమ్మేటు, ఫ్రెండు అయిన జేనీకి మాత్రమే తెలుసు. అలా ఒకరోజు కొత్తగా ఆ ఫ్లాట్ లో చేరిన సుందరి కంట పడ్డాడు దెయ్యం వేషంలోని జాన్. సుందరి భయపడి కేకలు వేసి బయటికి పరిగెత్తుకొచ్చింది.

అసలు మొదట్నుండీ సుందరి అక్కడ వుండటం షెర్లీకి ఇష్టం లేదు. ఏదో ఒక రకంగా సుందరిని పంపించేస్తే ప్రియుడు ఈజీగా వచ్చి పోవచ్చని ప్లాన్ చేస్తుండేది. కాగల కార్యం గంధర్వులే తీర్చినట్లు దెయ్యం వేషంలోని జాన్ సుందరి కంటపడ్డాడు. సుందరి మానసిక పరిస్థితి బాలేదనే వంకతో సుందరిని సెల్లార్ రూం లోకి పంపించారు వీళ్ళు. ఏ రహస్యమైనా ఎన్నాళ్ళో దాగదు. ఏదో ఒకరోజు బట్టబయలు అవుతుంది.

తరువాత ఒకరోజు 305 లోనుండి దయ్యం ముసుగులో వున్న జాన్ రావడం వెనకనున్న ఎక్జిట్ నుండి వెళ్ళడం సెక్యూరిటీ గార్డు చూసాడు. విషయాన్ని హౌసింగ్ మేనేజర్ చెవిలో ఊదాడు.

అతడు కాసేపు ఆలోచించి గార్డుకు ఏం చెయ్యాలో చెప్పి ఈ మిస్టరీని ఎలాగైనా ఛేదించాలనుకున్నాడు. రాత్రికి రాత్రే ఎవరికీ తెలియకుండా 3వ ఫ్లోర్ లో 305 కవర్ అయ్యేలా ఒక కెమెరా బిగించారు. రోజూ కెమెరాని పరిశీలించేవారు.

ఆ రాత్రి జాన్ రావడం కనిపించి అలర్ట్ అయిన ఇద్దరు సెక్యూరిటీ గార్డులు వెనకనున్న మెట్లదారిపై కాపు కాసి జాన్ ని గట్టిగా పట్టుకున్నారు. వెంటనే షెర్లీని, జేనీని పిలిపించి గద్దించి అడిగి నిజాన్ని రాబట్టారు.

వాళ్ళిద్దరూ ఏడుస్తూ తమ తప్పును ఒప్పుకున్నారు. ఎట్టకేలకు మిస్టరీ వీడింది. పాపం సుందరికి ప్రాణం పోయేంత పని అయింది. భయంతో జ్వరం తెచ్చుకుని
బాధపడింది. ఇది నేరం కాబట్టి షెర్లీని, జేనీని విధులనుండి తొలగించి నెలరోజుల్లో అకామిడేషన్ వదిలి బయటికి పొమ్మన్నారు. వారిచే సుందరికి క్షమాపణ చెప్పించారు. ఆ నెలరోజులూ వాళ్ళిద్దరూ సిగ్గుతో తలవంచుకునే తిరిగారు. తరువాత ఎక్కడో ఏదో ఆఫీసులో చిన్నజాబ్ చూసుకుని వెళ్ళిపోయారు.
సిరిచందన ఆనందానికి అవధులు లేవు. సుందరి ఆనందంగా తిరిగి 305 కి వచ్చేసింది.
ప్యారీ నా దగ్గరికి వచ్చి "చూసావా ఆ ఫిలిప్పినీ వాళ్ళ బండారం బయట పడింది. చేసిన నీచమైన పని అందరికీ తెలిసేసరికి సిగ్గుతో చచ్చిపోతున్నారు ఆ డెవిల్స్. సుందరిని బయటకు పంపించడానికి ఇంత ఘోరానికి ఒడికట్టారు. ఇప్పుడు చేస్తున్న మంచి జాబ్స్ పోగొట్టుకుని శిక్ష అనుభవిస్తున్నారు. నేను చెప్పాను కదా మనుషులే దెయ్యాల కంటే ప్రమాదకరం. స్వార్థం నింపుకున్న ఈ మనుషులకంటే అవెంతో నయం" అంది.
"నిజమే" అన్నాను నేను నిట్టూర్చుతూ.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments